## ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## ప్రాంతీయ వార్తలు

తేదీ: 15-05-2026 సమయం : సాయంకాలం 6గం. 10ని.లు

## ముఖ్యాంశాలు

- ఆత్మనిర్భర్ భారత్ లక్ష్య సాధనలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యపాత్ర పోషిస్తోందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.

- స్వదేశీ పరిజ్ఞానంతో తయారైన ప్రాజెక్టులు దేశ రక్షణ రంగాన్ని బలోపేతం చేస్తాయని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అన్నారు.

- సర్ ఆర్థర్ కాటన్ ఆశయాలకు అనుగుణంగా రాష్ట్రంలో ఇరిగేషన్ ప్రాజెక్టులను పూర్తి చేస్తున్నామని మంత్రి నిమ్మల రామానాయుడు తెలియజేశారు.

- దక్షిణ బంగాళాఖాతం ప్రాంతంలోని పరిస్థితులు నైరుతి రుతుపవనాల పురోగమనానికి అనుకూలంగా మారుతున్నాయని భారత వాతావరణం కేంద్రం వెల్లడించింది.

====================

ఆత్మనిర్భర్ భారత్ లక్ష్య సాధనలో ఆంధ్రప్రదేశ్ ముఖ్య పాత్ర పోషిస్తోందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. ఈరోజు ఆయన రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌తో కలిసి పుట్టపర్తిలో అడ్వాన్స్‌డ్ మీడియం కంబాట్ ఎయిర్ క్రాఫ్ట్ AMCA ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశారు. అలాగే.. డిఫెన్స్ రంగంలో కళ్యాణి స్ట్రాటజిక్ సిస్టమ్స్ లిమిటెడ్, భారత్ డైనమిక్స్ లిమిటెడ్, HFCL సంస్థలకు చెందిన ప్రాజెక్టుల శిలాఫలకాలను ఆవిష్కరించారు. కర్నూలు డ్రోన్ సిటీలో పరిశ్రమలు ఏర్పాటు చేసే వివిధ డ్రోన్ ప్రాజెక్టులకు కూడా వారు శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. కీలకమైన AMCA ప్రాజెక్టు రావటంతో పుట్టపర్తి.. దేశం గర్వించే వ్యూహాత్మకమైన రక్షణ కేంద్రంగా మారుతుందని అన్నారు. 15 వేల 803 కోట్ల రూపాయల ఖర్చుతో ఏర్పాటు చేసిన ఈ ప్రాజెక్టు ద్వారా సుమారు 7 వేల 500 మందికి ఉద్యోగావకాశాలు లభిస్తాయని ముఖ్యమంత్రి పేర్కొంటూ...

(ముఖ్యమంత్రి వాయిస్...28 సెకన్లు)

రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ మాట్లాడుతూ.. దేశ భద్రత విషయంలో ఇతర దేశాలపై ఆధారపడలేమని.. అందుకే ఆత్మనిర్భరత అనేది ఓ కీలకమైన అంశమని పేర్కొన్నారు. 4 డిఫెన్సు కంపెనీలకు శంకుస్థాపన, కర్నూలు డ్రోన్ సిటీలో 8 కంపెనీలకు శంకుస్థాపన చేశామని చెప్పారు. ఈ తరహా ప్రాజెక్టులన్నీ మన స్వదేశీ తయారీతో రక్షణ రంగాన్ని మరింత బలోపేతం చేస్తాయన్నారు. 15 వేల కోట్ల రూపాయల విలువైన పెట్టుబడితో ఎయిర్ క్రాఫ్ట్ ఇంటిగ్రేషన్ తో పాటు ఆధునిక ఫ్లైట్ టెస్టింగ్ సెంటర్ ను కూడా ఏర్పాటు చేస్తున్నామని, ఇలాంటి కేంద్రాలు కొన్ని దేశాల వద్ద మాత్రమే ఉన్నాయని రక్షణ మంత్రి తెలియజేస్తూ...

(రక్షణ మంత్రి వాయిస్...25 సెకన్లు)

====================

సర్ ఆర్థర్ కాటన్ ఆశయాలకు అనుగుణంగా రాష్ట్రంలో ఇరిగేషన్ ప్రాజెక్టులను పూర్తి చేస్తున్నామని జలవనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. ఆర్థర్ కాటన్ జయంతి సందర్భంగా ఈరోజు విజయవాడలోని క్యాంపు కార్యాలయంలో ఆయన చిత్రపటానికి మంత్రి ఘనంగా నివాళులర్పించారు. ముందు చూపుతో ధవళేశ్వరం, కృష్ణా బ్యారేజిలతో పాటు ఉభయ గోదావరి, కృష్ణా జిల్లాల్లో కాలువల నిర్మాణాలు చేసిన మహానుభావుడు కాటన్ అని కొనియాడారు. ధవళేశ్వరం బ్యారేజ్ కు 117 కొత్తగేట్ల ఏర్పాటు కోసం 150.09 కోట్ల రూపాయలు కేటాయించామని,

త్వరలోనే పనులు పూర్తి చేస్తామని చెప్పారు. గోదావరి డెల్టా ప్రక్షాళన కోసం 14 కోట్ల రూపాయలతో లైడార్ సర్వే పూర్తయిందని, ఆ సర్వే ఆధారంగా డిపిఆర్ తయారు చేస్తున్నామని మంత్రి తెలియజేశారు.

====================

సత్యసాయి జిల్లా.. దేశానికే రక్షణ శక్తికి నయా కేంద్రంగా తయారవుతుందని రాష్ట్ర విద్యా శాఖా మంత్రి నారా లోకేష్ అన్నారు. పుట్టపర్తిలో ఈరోజు జరిగిన అడ్వాన్స్‌డ్ మీడియం కంబాట్ ఎయిర్ క్రాఫ్ట్ AMCA ప్రాజెక్టుకు శంకుస్థాపన కార్యక్రమంలో ఆయన.. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ లతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడుతూ.. రాయలసీమకు రక్షణ ప్రాజెక్టులు వచ్చాయని, పెద్ద ఎత్తున ఉద్యోగ, ఉపాధి అవకాశాలు వస్తున్నాయని చెప్పారు. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానంలో అతి తక్కువ సమయంలో ఈ ప్రాజెక్టును సాకారం చేశామన్నారు. AMCA ప్రాజెక్టు రాకతో ఉమ్మడి అనంతపురం జిల్లా రాష్ట్రంలోనే అగ్రస్థానంలో నిలుస్తుందని మంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు.

====================

ఆంధ్రలో చిన్నారుల చదువులు (అచ్చ) ప్రాజెక్టు.. అంగన్వాడీ కేంద్రాల్లో విద్యా విప్లవానికి నాంది పలుకుతుందని మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి ఏ. సూర్య కుమారి తెలిపారు. విజయవాడలోని ఇరిగేషన్ కాంపౌండ్ కార్యాలయంలో అచ్చ ప్రాజెక్ట్ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అంగన్వాడీ కార్యకర్తల సేవలను అభినందించారు. రాష్ట్రంలో ఏ పథకమైనా చిట్టచివరి లబ్ధిదారునికి చేరడంలో అంగన్వాడీ కార్యకర్తలే ప్రధాన భూమిక పోషిస్తున్నారని కొనియాడారు. ఆసుపత్రి ప్రసవాల పట్ల గతంలో ఉన్న భయాందోళనలు పోయి, నూరు శాతం ఆసుపత్రి ప్రసవాలు జరుగుతున్నాయని సూర్యకుమారి వివరించారు.

====================

విరామం

====================

సమస్యల పరిష్కారం కోసం వచ్చిన వినతులను సాధ్యమైనంత త్వరగా పరిష్కరించాలని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖా మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి అధికారులను ఆదేశించారు. బనగానపల్లె క్యాంపు కార్యాలయంలో ఈరోజు ఆయన వివిధ వర్గాల ప్రజల నుంచి వచ్చిన విజ్ఞప్తులను స్వయంగా స్వీకరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్రంలో ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమం అభివృద్ధితో కూడిన సుపరిపాలనను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజా సమస్యల పరిష్కారమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని మంత్రి తెలియజేశారు.

====================

శాస్త్రీయ ఆధారాలు లేని నాటు వైద్యం, మూఢనమ్మకాలతో ప్రాణాలకు ముప్పు వాటిల్లుతుందని పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎన్. ప్రభాకర రెడ్డి హెచ్చరించారు. జిల్లా వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో సీతానగరం మండలం మరిపివలసలో 'నాటు వైద్యానికో నమస్కారం' పేరిట ఈరోజు నిర్వహించిన అవగాహన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాను నాటు వైద్యం, మూఢనమ్మకాలు లేని జిల్లాగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ఈ వినూత్న కార్యక్రమాన్ని చేపట్టినట్టు తెలిపారు. నాటు వైద్యం వల్ల శరీరంలోని కీలక అవయవాలు ఇన్ఫెక్షన్లకు గురవుతాయని, అత్యవసర సమయంలో ప్రాణహాని కలిగే ప్రమాదం ఉందని కలెక్టర్ సూచించారు.

====================

తిరుపతి జిల్లా గాజులమండ్యం సమీపంలోని శ్రీ వేంకటేశ్వర సహకార చక్కెర కర్మాగార పునరుద్ధరణ, ఆధునీకరణ అంశాలపై కేంద్ర సహకార మంత్రిత్వ శాఖ సానుకూలంగా స్పందించిందని పార్లమెంట్ సభ్యులు మద్దిల గురుమూర్తి ఈరోజు తెలిపారు. ఈ మేరకు కేంద్ర సహకార శాఖ నుండి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి అధికారిక లేఖలు పంపినట్లు వెల్లడించారు. చక్కెర కర్మాగారం పునరుద్ధరణ జరిగితే రైతులకు, కార్మికులకు, స్థానిక యువతకు భారీగా ఉపాధి అవకాశాలు లభించడంతో పాటు తిరుపతి జిల్లాలో పారిశ్రామిక అభివృద్ధి జరుగుతుందని ఎంపీ పేర్కొన్నారు.

====================

ఆకాశవాణి 90 వసంతాల వేడుకలు విశాఖపట్టణంలో అట్టహాసంగా ఈరోజు ప్రారంభమయ్యాయి. నగరంలోని కళాభారతి ఆడిటోరియంలో జరుగుతున్న ఈ వేడుకల్లో ద్వారం వి.కె.జి. త్యాగరాజ్ నిర్వహణలో "అలనాటి మధుర భావ గీతాలు" పేరిట సంగీత విభావరి కొద్దిసేపటి క్రితం ప్రారంభమయ్యింది. ఈ కార్యక్రమానికి GVMC కమిషనర్ పల్లి నల్లనయ్య ముఖ్య అతిధిగా హాజరయ్యారు. రీజనల్ ఛానెల్ మేనేజర్ ఆర్. హర్షలత, కార్యక్రమ విభాగధిపతి పి.వి.రామ్ గోపాల్, ఆకాశవాణి సిబ్బంది, శ్రోతలు ఈ వేడుకలలో పాల్గొన్నారు.

====================

దక్షిణ బంగాళాఖాతం, అండమాన్ సముద్రం, అండమాన్ నికోబార్ దీవులలోని కొన్ని ప్రాంతాలలో పరిస్థితులు రాగల 24 గంటల్లో నైరుతి రుతుపవనాల పురోగమనానికి అనుకూలంగా మారుతున్నాయని అమరావతిలోని భారత వాతావరణం కేంద్రం తెలిపింది. పశ్చిమ-మధ్య బంగాళాఖాతంపై ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో ఉత్తర కోస్తా ఆంధ్రప్రదేశ్, యానాంలలో రేపు ఎల్లుండి తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు లేదా ఉరుములతో కూడిన జల్లులు ఒకటి లేదా రెండు చోట్ల కురిసే అవకాశముందని పేర్కొంది. ఉరుములతో కూడిన మెరుపులు, ఈదురు గాలులు వీచే అవకాశముందని వాతావరణ కేంద్రం అధికారి వివరిస్తూ...

(వాయిస్...28 సెకన్లు)

====================

పెరుగుతున్న ఉష్ణోగ్రతలు, వడగాడ్పుల నేపథ్యంలో కార్మికుల ఆరోగ్య భద్రతకు యాజమాన్యాలు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని విశాఖ జిల్లా అసిస్టెంట్ లేబర్ కమిషనర్ మోహన లక్ష్మి సూచించారు. ఈ మేరకు ఒక ప్రకటన చేస్తూ.. ఎండ తీవ్రత అధికంగా ఉందని, నిర్మాణ రంగం, పరిశ్రమలు, ఇతర బహిరంగ ప్రదేశాల్లో పనిచేస్తున్న కార్మికులకు తగిన రక్షణ చర్యలు తప్పనిసరిగా అమలు చేయాలని ఆదేశించారు.

====================

====================